



సరళమైన రీతిలో బోధన చేయాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

డోర్నకల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించే విద్యార్థులకు ఉపాధ్యాయులు సరళమైన రీతిలో బోధన చేయాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముల్కలపల్లి జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆపై వారికి ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మా, పాఠశాల హెచ్‌ఎం రుక్మాంగదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేపై.. సందేహాలెన్నో!


వర్ధన్నపేట మండల కేంద్రంలో ఇంటింటి కుటుంబ సర్వే



- పూర్తి సమాచారం ఇచ్చేందుకు యజమానుల నిరాకరణ
- 'గోప్యత'పై ప్రభుత్వం భరోసానిస్తున్నా వీడని అనుమానాలు
- సర్వేకు సహకరించని సంపన్నులు
- వివరాల సేకరణలో ఎన్యూమరేటర్ల ఇబ్బందులు
- మధ్యాహ్నం వేళ ఇళ్లలో ఎవరూ ఉండని పరిస్థితి
- అసమగ్రంగా సాగుతున్న ఇంటింటి కుటుంబ సర్వే
- ఇంకా మొదలు కాని డాటా కంప్యూటీకరణ
- సిబ్బందిపై పెరుగుతున్న ఒత్తిడి

హనుమకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాల, తెగలు, వెనుబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ సర్వే ద్వారా తాము సేకరిస్తున్న సమాచారం అంతా గోప్యంగా ఉంటుందని.. ప్రజలు నిర్భయంగా తమ స్థితిగతుల వివరాలను ఎన్యూమరేటర్లకు చెప్పాలని సూచిస్తోంది. అయినా ప్రజల్లో మాత్రం సందేహాలు వీడటం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. సర్వేకు వెళ్లిన అధికారులతో ప్రజల తమ సందేహాలు, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. దీంతో సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలోనే సర్వేలో కొందరు వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు.. ముఖ్యంగా సంపన్న కుటుంబాల నుంచి భిన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. కొన్ని చోట్ల మహిళా ఎన్యూమరేటర్లతో కొందరు అసభ్యంగా మాట్లాడుతున్నారని, ఒక్కొక్కరు వెళ్తే నమ్మడం లేదని చెబుతున్నారు. దీంతో కనీసం ఇద్దరిని పంపాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు పాట్లు

సర్వే ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, మున్సిపాలిటీ సిబ్బందిని నియమించారు. ఈనెల 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కాగా సర్వే ఫారాలు సకాలంలో అందక కొన్ని చోట్ల ఒక రోజు ఆలస్యంగా మొదలైంది. ఇప్పటికీ ఎన్యూమరేటర్లకు సర్వే ఫారాలు చాలినన్ని అందడం లేదన్న ఫిర్యాదులున్నాయి. కుటుంబ సర్వే విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లి.. మధ్యాహ్నం తర్వాత సర్వేలో ఇంటింటికి వెళుతున్నారు. అయితే పగలు సమయంలో ఇళ్లలో చాలామంది ఉండకపోతుండటంతో వివరాల సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వెళ్లిన ప్రాంతానికే మళ్లీ వెళుతూ వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈనెల 18వ తేదీలోపు గణన పూర్తి చేయాలన్న ఆదేశాలతో చేసేది లేక వారు ఉదయం 6గంటలకే సర్వేకు వెళ్లి 8గంటలకు అటునుంచి అటే స్కూళ్లకు వెళుతున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం స్కూలు అయిపోగానే మళ్లీ సర్వే విధులకు వెళుతున్నారు. కొందరు ఉపాధ్యాయులైతే రాత్రి 8 గంటల వరకు సర్వేలో ఉంటున్నారు. ఈ క్రమంలో అలసి పోయి కొందరు ఉపాధ్యాయులు అనారోగ్యం పాలవుతున్నారు. సర్వే విధులను కేటాయింపులో సహేతుకత లోపించదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ల(ఎస్‌జీటీలు)కు ఎన్యూమరేటర్ల విధులు ఇచ్చి పెద్దగా పని ఒత్తిడి లేని, కాంట్రాక్టు సీఆర్‌పీలను సూపర్వయిజర్లుగా నియమించడం పట్ల ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ)లను ఎన్యూమరేటర్లు నియమించగా వీరిలో చాలా మంది తమ పలుకుబడిని ఉపయోగించి మినహాయింపు పొందడంతో ఆ భారం కూడా టీచర్లపైనే పడుతోంది.

ఇన్ని ప్రశ్నలా?



సర్వే ఫారం చాంతాడంత ఉండడం కూడా ఇబ్బందులకు గురి చేస్తోంది. ఫార్ట్-1, పార్ట్ -2 పేరుతో 75 ప్రశ్నలను గుప్పిస్తుండడంతో ఇంటి యజమానులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. పైగా ఇన్ని ప్రశ్నలా? ఇవన్నీ అవసరమా ? అని సర్వే సిబ్బందిపై ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు. కొందరైతే వివరాలు చెప్పడానికి విసుక్కుంటున్నారు. చాలా ప్రశ్నలు అనవసరమని భావించి జవాబులు చెప్పటానికి నిరాకరిస్తున్నారు. దీంతో ఒక్కో ఇంటిని సర్వే చేయడానికి ఎన్యూమరేటర్‌కు గరిష్ఠంగా 45 నిమిషాలు అంతకన్నా ఎక్కువగానే పడుతోంది. అంతసేపు ఇంటి పెద్ద ఓపిగ్గా కూర్చుని వివరాలు ఇవ్వడం ఇబ్బందిగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలో పలు ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి సమాచారం ప్రజల వద్ద లేకపోవడంతో వెతుక్కోవలసిన పరిస్థితి ఎదురవుతోంది. తమ దగ్గర పత్రాలన్ని తెచ్చి ఎన్యూమరేటర్ల ముందు పడేసి అందులో చూసి రాసుకొమ్మని కూడా అంటున్నారు. సర్వే ఫారంలో పేర్కొన్న ప్రకారం కోళ్లు, గొర్రెలు, పశువులు తదితర వివరాలు ఎందు కంటూ నిలదీస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సర్వే గణాంకాలిలా..

జిల్లా	కుటుంబాలు	బ్లాకులు	ఎన్యుమరేటర్లు	సూపర్వైజర్లు
హనుమకొండ	3,00,000	1,916	1,916	218
వరంగల్	1,45,882	1,841	1,841	204
జనగామ	1,62,512	1,350	1,350	145
మహబూబాబాద్	2,45,953	1,884	1,884	186
ములుగు	97,552	7,13	7,13	74
భూపాలపల్లి	1,31,030	1,043	1,043	121
మొత్తం	10,82,929	8,747	8,747	948

ఏరోజు కారోజు..

పూర్తి చేసిన సర్వే ఫారాలను ఏ రోజు కారోజు ఎంపీడీవో కార్యాలయాల్లో సూపర్వైజర్లకు అప్పగిస్తున్నారు. అయితే ఎన్యూమరేటర్లు వెళ్లే సరికి ఆ సూపర్వైజర్లలో కొందరు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు మళ్లీ అక్కడకు వచ్చే దాకా ఉండి అందచేయాల్సివస్తోందని సమాచారం. ఉదయం సర్వే ఫారాలు తీసుకోవడం, వాటిని తిరిగి ఇచ్చే విషయంలో ఎన్యూమరేటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. సేకరించిన వివరాలను ఏ రోజుకారోజే కంప్యూటరైజ్ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా ఆ ప్రక్రియ ఇప్పటి వరకు ఎక్కడా ప్రారంభం కాలేదని తెలుస్తోంది.

సందేహాలతో అసమగ్రంగా ప్రక్రియ

సర్వేలో చాలా మంది పూర్తి వివరాలు ఇవ్వడానికి వెనుకాడుతుండటం, ఆస్తులు, ఆదాయం, భూములు.. ఇతరత్రా వివరాలు ఇవ్వడం ద్వారా మున్ముందు సంక్షేమ పథకాల్లో కోత పడుతుందేమోనన్న అనుమానాలతో గోప్యత పాటిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ

మిగతా 7వ పేజీలో...

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. 11 సంవత్సరాలు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఎనలేని సేవలందించి జాతీయ విద్యా విధానాన్ని అమలు చేశారని చెప్పారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతి ఏటా నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మైనారిటీ వర్గాల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అగ్రస్థానంలో నిలుస్తారని చెప్పారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా అనేక సేవలందించారని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

- మందుల సరఫరాపై ఆరా
- రికార్డులను పరిశీలించిన అధికారులు


తనిఖీ చేస్తున్న హేమంత్ సహదేవరావు బొర్కడే, లెనిన్ వత్సల్ టొప్పో

నెహ్రూసెంటర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో మందుల సరఫరా తీరును తెలంగాణ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ సహదేవరావు బొర్కడే జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సోమవారం పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హేమంత్ సహదేవరావు బొర్కడే మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి మందుల సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తున్నామని, ఆస్పత్రుల్లో మందులు రోగులకు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి స్టాక్ రికార్డులను పరిశీలించి అవసరమైన మందులకు ఆన్‌లైన్ ద్వారా స్టాక్ ఇండెంట్‌ను సమర్పిస్తే వాటిని సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఔషధ పోర్టల్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గుండాల మురళీధర్, ఈఈ ఉమామహేశ్వర్, డీఈ వెంకటకృష్ణ, విద్యాసాగర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ గఫార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక


బలాష్టి రమేష్, అధ్యక్షుడు


పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్, సిద్ధోజు కవిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బలాష్టి రమేష్, ప్రధాన కార్యదర్శిగా పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొల్లం శ్రీనివాస్, మల్లెల సాంబయ్య, తండా ప్రభాకర్, జి.అనిత, చీకటి వెంకట్రాంనర్సయ్య, చీకటి ఉపేందర్, కార్యదర్శులుగా వై.సాయిబాబు, రాచకొండ ఉపేందర్, సంగ శ్రీనివాస్, టి.రవీందర్, జి.కిషన్, రవీందర్‌రెడ్డి, కె.జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా దైద వెంకటేశ్వర్లు, సబీయభాను, సీహెచ్.శ్రీలత, జి.బాలు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కొత్త వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లుగా చుంచు శ్రీశైలం, ఎ.సువర్ణ, సోమారపు ఐలయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ధాన్యంతో మార్కెట్ కళకళ

- ఈ సీజన్‌లో అధికంగా 8,064 బస్తాల రాక
- రూ.2200 నుంచి రూ.2300 మధ్యనే ధరలు

కేసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్ సోమవారం ధాన్యం రాశులతో కళకళలాడింది. పది రోజులుగా మార్కెట్‌కు కొత్త ధాన్యం 500 నుంచి 2000 బస్తాల రాబడులు కొనసాగుతుండగా రెండు రోజుల సెలవులు అనంతరం తాజాగా ఒకేసారి 8వేల బస్తాలు విక్రయానికి రావడం విశేషం. మార్కెట్లోని కవర్ షెడ్లు నిండి ఓపెన్ యార్డులో ధాన్యం రాశులు కనిపించాయి. మార్కెట్‌కు 155 మంది రైతులు 8,064 బస్తాల్లో 5,240 క్వింటాళ్ల ధాన్యాన్ని మార్కెట్‌కు విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఇందులో 421 బస్తాలు జైశ్రీరాం రకం ధాన్యం, 2175 బస్తాలు ఆర్ఎన్ఆర్, 5468 బస్తాలు హెచ్ఎంటీ రకం ధాన్యం విక్రయానికి వచ్చాయి. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని 'ఈ-వేలం'లో జైశ్రీరాం రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2711, కనిష్ఠంగా రూ.2459, సగటున రూ.2480, ఆర్ఎన్ఆర్ రకం రూ.2626, రూ.2206, రూ.2511, హెచ్ఎంటీ రకం గరిష్ఠంగా రూ.2559, కనిష్ఠంగా రూ.2196, సగటున రూ.2532 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాల్లో 17శాతం లోపు తేమతో నాణ్యమైన ధాన్యానికి క్వింటాకు రూ.2400 నుంచి రూ.2500 వరకు ధరలు రాగా, అధిక సరుకు మాత్రం రూ.2200 నుంచి రూ.2350 మధ్యనే ధరలు నమోదయ్యాయి. పైమార్కెట్లో ధాన్యానికి రేటు లేకపోవడంతో ఇక్కడి మార్కెట్లో ధరలు పుంజుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి క్వింటాకు రూ.2800 నుంచి రూ.3100 మధ్యన ఉండగా ఈసారి ఆ ధరలు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ధాన్యం ధర మరింత తగ్గే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.


కేసముద్రం మార్కెట్ ఓపెన్ యార్డులో పోసిన ధాన్యం రాసులు

వ్యాపారుల సమ్మె విరమణ

- సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం
- నేటి నుంచి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు


బేతోలు సమీపంలోని ఓ కాటన్ పరిశ్రమలో పత్తిలో తేమ శాతం చూస్తున్న సీసీఐ సిబ్బంది

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 11: పత్తి వ్యాపారులు సమ్మె విరమించడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి సీసీఐ కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభమయ్యాయి. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఎల్-1, ఎల్-2, ఎల్-3 రకాల పేరుతో పత్తి కొనుగోళ్లను సీసీఐ చేస్తూ వ్యాపారులను, రైతులను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు బంద్ చేయాలని పిలుపునివ్వడంతో బంద్ అయిన విషయం తెలిసిందే. అయితే ఉదయం హైదరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు, సీసీఐ సీఎండీ లలిత్ కుమార్‌గుప్తా, రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం నాయకులతో మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చర్చలు జరిపారు. దాంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు జిల్లా మార్కెటింగ్ అధికారులు మార్కెట్ యార్డుల్లో, సీసీఐ కొనుగోళ్లను యథావిధిగా జరపాలని సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సీసీఐ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని ఆయా మార్కెటింగ్ కార్యదర్శులు తెలిపారు. రైతులు గమనించి పత్తిని మార్కెట్ యార్డులకు తీసుకురావాలని, అలాగే సీసీఐ కొనుగోళ్లకు తరలించి మద్దతు ధర పొందాలని మార్కెట్ అధికారులు కోరారు.

చిల్లర కాంటాల జోరు..

వ్యవసాయ మార్కెట్లలో పత్తి కొనుగోళ్లు బంద్ కావడంతో మహబూబాబాద్, కేసముద్రం మండలాల్లో చిల్లర కాంటల జోరు ఊపందుకుంది. మహబూబాబాద్ మార్కెట్‌కు ఉదయం సుమారు 500 నుంచి 600 బస్తాల వరకు పత్తిని తీసుకురాగా కొనుగోళ్లు లేవని మార్కెట్ సిబ్బంది చెప్పడంతో రైతులు చిల్లర కాంటాలను ఆశ్రయించారు. దాంతో ఇదే అదునుగా భావించిన చిల్లర కాంటాల వ్యాపారులు మార్కెట్లలో పత్తి క్వింటాకు రూ.7వేలకు పైగా ధర పలుకుతుండగా చిల్లర కాంటాల వద్ద తక్కువ ధరకే ఖరీదులు చేస్తున్నట్లు పలువురు రైతులు వాపోయారు. మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు బంద్ ఉండడంతో బయట చిల్లర కాంటల వద్ద పత్తిని విక్రయించి రైతులు నష్టపోయారు.

చాంబర్ అభివృద్ధికి కృషి చేస్తాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాంబర్ ఆఫ్ కామర్స్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలో సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. పట్టణంలో వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం సాకారం అందిస్తుందని తెలిపారు. వ్యాపారులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా మచ్చ సురేష్, ప్రధాన కార్యదర్శిగా తల్లాడ హీరాధర్, కోశాధికారిగా చిదిరాల శ్రీనివాస్‌తో పాటు నూతనంగా పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మైనారిటీ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వరంగల్ చాంబర్ ప్రతినిధులు విద్యాప్రకాశ్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, చక్రపాణి, చలువాది సత్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, సుధాకర్, సుధీర్, అనిల్‌కుమార్, గుండాల నర్సయ్య, మోహన్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ ఇవ్వాలి

- తేమ పేరుతో ఇబ్బందులు పెట్టొద్దు
- ఎంపీ రాజేందర్

జనగామ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆంక్షలు లేకుండా సన్న, దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ నాయకులు ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈటల మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన ప్యాడీ క్లీనింగ్ మిషన్ లేక పోవడంతో రైతులు గంటకు రూ.వెయ్యి చెల్లించి ప్రైవేట్ ప్యాడీ క్లీనింగ్ మిషన్ రెంట్‌కు తీసుకొని ధాన్యం విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ప్యాడీ క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని, రైతులు పండించే ప్రతి క్వింటాలు ధాన్యానికి రూ.500బోనస్ చెల్లిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హమాలీల చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని, కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. ఒక్కబస్తా 41 కిలోల కాంటా వేసిన మిల్లులకు ధాన్యం తరలించాక మళ్లీ తాలు, మట్టి పేరుతో ధాన్యం కట్ చేసి రైతులను మోసం చేయవద్దన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు సమస్యల గురించి ప్రభుత్వం మిల్లర్లతో చర్చలు జరిపిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొనుగోళ్లు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, కత్తుల లక్ష్మి, సౌడ రమేశ్, మహంకాళి హరిశ్చంద్రగుప్త, బొమ్మకంటి అనిల్ గౌడ్, ఎలబోయిన రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పారా మెడికల్ కౌన్సెలింగ్ వాయిదా

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12వ తేదీన నిర్వహించాల్సిన డిప్లొమా పారా మెడికల్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి కౌన్సెలింగ్ నిర్వహించే తేదీని ప్రకటిస్తామని, అభ్యర్థులు ఎలాంటి అయోమయానికి గురి కావద్దని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

చిట్‌ఫండ్ ఎదుట బాధితుల ఆందోళన



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

బాలసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమకు చిట్టి డబ్బులు ఇవ్వడంలేదంటూ హనుమకొండ బాలసముద్రంలోని ఓ చిట్‌ఫండ్ కంపెనీ ఎదుట బాధితులు సోమవారం ఆందోళన చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సదరు చిట్‌ఫండ్ కంపెనీకి డబ్బులు కట్టినవారికి తిరిగి ఇవ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తుందని వివిధ జిల్లాల నుంచి తరలొచ్చిన బాధితులు సుమారు 400 మంది సంస్థ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ క్రమంలో బాధితులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. చిట్‌ఫండ్ యజమాని మధ్యవర్తిగా కొందరు వ్యక్తులతో పోలీసులు మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని చెప్పడంతో మధ్యవర్తిగా వచ్చిన వారు రూ.2లక్షల లోపు ఉన్నవారికి డిసెంబరు, జనవరి నెలల్లో డబ్బులు చెల్లిస్తామని, కొందరికి భూములను రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా హనుమకొండ, సుబేదారి పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఆకాశమే హద్దుగా బాలికలు ఎదగాలి

- వారు విద్యావంతులైతే సమాజానికి మేలు
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలు ఆకాశమే హద్దుగా ఎదగాలని, వారు విద్యావంతులైతేనే సమాజం బాగుపడుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం నెమలిగొండలో మైనారిటీ గురుకుల విద్యాలయంలో దేశ మొదటి విద్యాశాఖ మంత్రి అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మైనార్టీ వెల్ఫేర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటం వద్ద కడియం నివాళులర్పించి మాట్లాడారు. 2016లో తాను విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే బాలికలకు మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో బాలికలకు రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకువచ్చానని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 1000 గురుకులాలు ఉన్నాయని తెలిపారు.

బాల్య వివాహాలను నివారించడానికి కేజీబీవీలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించడంతో దేశ వ్యాప్తంగా అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత ఆధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ చైర్మన్ జూలకుంట్ల లావణ్యాశిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియంను సన్మానిస్తున్న మైనార్టీ గురుకుల అధ్యాపకులు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- సంపూర్ణ అభియాన్ ద్వారా కేంద్రం కృషి
- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- నీతి ఆయోగ్ సూచించిన రంగాల్లో సత్ఫలితాలు సాధించాలి
- నిరుపేదల అభ్యున్నతికి పాటుపడాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో విస్తృత పర్యటన



ములుగు కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్‌కుమార్

భూపాలపల్లి కలెక్టరేట్/మహాముత్తారం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ద్వారా విశేష కృషి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆయన సోమవారం విస్తృతంగా పర్యటించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన విద్య, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, ప్రణాళిక శాఖ అధికారులతో సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో భాగంగా మహాముత్తారం, పలిమెల బ్లాక్‌లో అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ కార్యక్రమంపై సమీక్షించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అభియాన్ పారామీటర్స్‌పై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు.

భూపాలపల్లి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచి దేశానికి రోల్‌మోడల్‌గా నిలపాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుకు నివేదిక అందిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు, నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. మహిళలకు గర్భధారణ అయిన నాటి నుంచే సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యంగా బిడ్డ జన్మనిస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు.గణపురం మండలం చెల్పూర్ గ్రామంలో మిల్లెట్ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భూసార పరీక్షలు చేస్తూ వేసుకోవాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గిరివికాస్ పథకం కింద 186 సర్వీసులను మంజూరుచేశామని, మరో 136 సర్వీసులను మంజూరు చేయాల్సి ఉందని, దీనిపై తక్షణమే చర్యలు చేపడతామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం నీతి ఆయోగ్ బ్లాక్ విలేజ్ అయిన మహాముత్తారం మండలం కేంద్రంలో పర్యటించిన బండి సంజయ్ వైద్యఆరోగ్య, ఉద్యాన, డీఆర్డీవో, సంక్షేమ, విద్యా శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అదే ప్రదేశంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. గర్భిణులకు చీర, గాజులతో ఒడి నింపారు. మహాముత్తారం నిమ్మగూడెం నుంచి కనుకునూరు వరకు ఉన్న 16 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి అటవీ శాఖ అడ్డుకుంటోందని స్థానికులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అధికారులతో మాట్లాడతానని అన్నారు. ఆయన వెంట కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి

ములుగు (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని మారుమూల వెనుకబడిన ప్రాంతాలు, నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీతి ఆయోగ్ సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. ములుగు జిల్లాలో ఆయన సోమవారం పర్యటించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనకు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, జి.సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

ఆతర్వాత ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. జిల్లాలో వెనుకబడిన మండలమైన కన్నాయిగూడెంలో నీతి సూచిక లను, జూలై నుంచి సెప్టెంబరు వరకు జరిగిన సంపూర్ణత అభియాన్ గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీతి ఆయోగ్ జిల్లా లో సూచించిన ఆరు ఇండికేటర్లను, మండలంలో సూచించిన ఇండికేటర్‌ల పురోగతి, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసు కు న్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం సంక్షేమ ఫలాలు అందరికీ అందిం చాల నే ఉద్దేశంతో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. 2018లో భారతదేశం ఆర్థిక ప్రగతిలో 11వస్థానంలో ఉండేదని, ప్రస్తుతం ఐదో స్థానా నికి చేరుకుందని తెలిపారు. 2028నాటికి మూడవ స్థానానికి తీసుకు రావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందులో భాగం గానే దేశవ్యాప్తంగా నీతి ఆయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ కార్యక్ర మాన్ని చేపట్టిందని చెప్పారు. 2023లో దేశవ్యాప్తంగా 500ప్రత్యేక బ్లాక్‌ల ను గుర్తించి ఆప్రాంతాల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 10బ్లాక్‌లను ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ఆరు ప్రామాణిక అంశాలుగా తీసుకుని లక్ష్యాన్ని ఏ మేరకు చేరుకోవడంలో ఎలాంటి అవాంతరాలు తలెత్తుతున్నాయని, తదితర అంశాలను తెలుసుకొనేందుకే జిల్లాకు వచ్చానన్నారు. అభివృద్ధిలో ములుగు ప్రాంతం మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ప్రపంచ కరాటే పోటీల్లో ఆదిత్యకు రజతం



రజత పతకంతో పొన్న ఆదిత్య

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పాంనూర్ గ్రామానికి చెందిన పొన్న వేణు- కోమలత దంపతుల కుమారుడు పొన్న ఆదిత్య అండర్-14, 60 కేజీల ప్రపంచ కరాటే పోటీల్లో రజత పతకం సాధించాడు. సోమవారం గ్రామస్తులు మాట్లాడుతూ అక్టోబరులో హన్మకొండ ఇండోర్ స్టేడి యంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించి ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 7నుంచి 10 వరకు గోవాలోని మపూసా పట్టణంలోని పెద్దమ్ ఇండోర్ స్టేడి యంలో జరిగిన ప్రపంచ కరాటే పోటీల్లో రజత పతకం సాధించాడు. ఆదివారం సాయంత్రం గోవాలో మెడల్ అందుకున్నట్లు తెలిపారు.

ఓపీ, ఐపీ సేవలు పెంచాలి

జనగామ డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో ఓపీ, ఐపీ సేవలను పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం తాటికొండ పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ రిజిస్టర్‌లను, మందుల గదిని, వైద్య సిబ్బంది రిజిస్టర్‌లను పరిశీలించారు. పీహెచ్‌సీలో సాధారణ డెలివరీలు జరిగేలా చూడాలన్నారు. ఎన్‌సీడీ సేవలు పొందేవారికి సకాలంలో మందులను అందించాలని, ఆస్పత్రికి వచ్చిన సమయంలో వారికి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేయాలన్నారు. ఎఎన్‌సీ సేవలను పెంచడంతో పాటు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఉపకేంద్రాలలో మందుల కొరత లేకుండా చూడాలని కోరారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



తాటికొండ పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు

మారుమూల గ్రామాలకు టెలికం సేవలు

టెలీ కమ్యూనికేషన్ జాయింట్ కంట్రోలర్ సంపర్



మాట్లాడుతున్న సంపర్

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు టెలికం సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు టెలికమ్యూనికేషన్ జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్ తెలిపారు. కలెక్టరేట్‌లో టెలికమ్యూనికేషన్ సేవలపై బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో భారత్ నెట్‌ను ప్రవేశపెట్టి వినియోగదారుల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకొని విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 2.50 లక్షల గ్రామాల్లో టెలికం సేవలు విస్తృత పరచడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 2.14 లక్షల గ్రామ పంచాయతీల్లో టెలికం సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మిగిలిన గ్రామపంచాయతీల్లో అటవీ తదితర సమస్యలతో అనుమతులు రావాల్సి ఉందని, త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరించి సేవలు అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీవో బాబురావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సదస్సులను జయప్రదం చేయాలి

కొత్తగూడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తుడుందెబ్బ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ఆదివాసీల హక్కులు, చట్టాల అమలు కోసం ఈనెల 20 నుంచి డిసెంబరు 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల సదస్సులను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి పిలుపునిచ్చారు. కొత్తగూడ మండల కేంద్రంలో తుడుందెబ్బ సదస్సుల కరపత్రాలను ఆ సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈనెల 20న ఉట్నూర్, 30న ఖమ్మం, డిసెంబరు 7న వరంగల్, 13న నిజామాబాద్ జిల్లాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో మహాసభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తుడుందెబ్బ అనుబంధ సంఘాలైన ఉద్యోగ, విద్యార్థి, మహిళా, రైతు, ఆదివాసీ ప్రజా ఉద్యమ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సిద్దబోయిన సంజీవ్, జిల్లా నాయకులు అల్లెం జంపయ్య, ఈక విజయ్, విద్యార్థి సంఘం నాయకులు బుర్క పవన్, శివకృష్ణ, కౌశిక్, సుశాంత్ చరణ్ పాల్గొన్నారు.



కొత్తగూడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- దళారులను నమ్మి మోసపోవద్దు
- పత్తి రైతులకు అండగా ప్రభుత్వం
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చిన్నవంగరలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పెద్దవంగర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి రైతులకు సూచించారు.

సోమవారం సీసీఐ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నవంగర గ్రామ శివారులో గల వాసవీ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చిన ప్రతీ రైతుకు చెందిన పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు మెరుగైన సేవలందించడానికి మార్కెట్ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిన్నింగ్ మిల్లు వ్యాపారులు సైతం పత్తిలో తేమ ఉన్నా రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేయాలని సూచించారు. వానాకాలంలో రికార్డు స్థాయిలో పత్తి సాగు చేశారని, పత్తి రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందన్నారు. పత్తికి మద్దతు ధర అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రైతుల కుటుంబాల్లో ఆనందం ఉండేలా ప్రభుత్వం అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తోందన్నారు.

రైతులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని మండిపడ్డారు. 8 నుంచి 12శాతం వరకు తేమ ఉన్న పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వైస్ చైర్మన్ బట్టునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, మురళిగౌడ్, సోమేశ్వర్‌రావు, గోపాల్, సోమరాజశేఖర్, సతీష్, చంద్రశేఖర్, హరికృష్ణ, సైదులు మార్కెట్ శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మొద్దు

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మరిపెడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలంలోని అబ్బా యిపాలెం, చిల్లంచర్ల, రాంపూ ర్‌లలో సోమవారం ఐకేపీ సెంటర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లా డుతూ.. పంట కోసిన వెంటనే ధాన్యం విక్రయిం చకుండా పది రోజులు ఎండబెడితే తేమ శాతం తగ్గుతుందన్నారు. నాణ్యమైన ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,320, రెండో రకానికి క్వింటాకు రూ. 2,300 చెల్లించడం జరుగుతుందన్నారు. నిర్ణీత సమయానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలని మార్కెట్ యార్డు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, జిల్లా నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, పెండ్లి నరసింహారెడ్డి, గుండగాని వెంకన్న, షేక్ అఫ్జల్, తహసీల్దార్ సైదులు, ఏవో వీరాసింగ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంచంద్రునాయక్

రైతుల సంక్షేమానికి సీఎం కృషి

మరిపెడ : రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సోమవారం మరిపెడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మరిపెడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులందరికీ డిసెంబర్ లోపు పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత యుగేంధర్‌రెడ్డి, డీఎస్‌వో, ఏడీఏ పూర్ణచందర్, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, అంబరీశ, తాజ్‌ద్దీన్, రాంలాల్, అఫ్జల్, అఫ్స ర్, ఏవో వీరాసింగ్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట క్వింటాల్	క్వింటా గరిష్ఠ ధర	క్వింటా కనిష్ఠ ధర
మక్కలు (బిల్టీరకం)	2495	2080
పల్లికాయ (సూక)	5010	4000
కందులు	....	....
పెసళ్లు	....	....
పత్తి	6960	5500
పసుపు (కాడి)	11427	10565
పసుపు (గోల)	10806	10023
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	17000	14000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341 ఏసీ	14000	11000
దేశీ ఏసీ	......	.....
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం



రైతు రాజకొంరయ్యకు పట్టాదార్ పాస్ పుస్తకం ఇస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ (ఫైల్)

పండుటాకులను పట్టించుకోకపోతే..

చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందే

- వారసులూ తస్మాత్ జాగ్రత్త
- వృద్ధులకు అండగా సీనియర్ సిటిజన్ యాక్టు



భీమదేవరపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమను కనిపెంచి జీవితాన్ని ఇచ్చి.. వృద్ధాప్యానికి చేరుకున్న తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోవడం లేదు కొందరు వారసులు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన తల్లిదండ్రులకు అండగా నిలవాల్సిన వారు కఠినంగా వ్యవహరిస్తున్నారు. చివరకు అనాథ శరణాల యాలు, వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న సంఘటనలనూ చూస్తు న్నాం. కొందరైతే కన్నవారిపై కర్కషంగా దాడులు చేస్తున్న ఘట నలూ చూస్తున్నాం. అలాంటి వాటికి విరుగుడు మందులా 2005 లో నాటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టును అమల్లోకి తెచ్చింది. వృద్ధ తల్లిదండ్రుల పేరిట ఉన్న స్థిర చరాస్తులను వారసులు తమ పేర్లపై పట్టాలు చేసుకొని.. ఆ తర్వాత కన్నవారిని పట్టించుకోని సంఘటనలున్నాయి. ఈ నేప థ్యంలో 2005లో అమల్లోకి వచ్చిన సీనియర్ సిటిజన్ యాక్టు ఆ వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలుస్తోంది. కర్క శత్వం ప్రదర్శించిన వారసులను చట్టం ముందు దోషులుగా నిలబెడుతోంది.

వ్యవసాయ భూములను పట్టాలు చే యించుకున్న తర్వాత తల్లిదండ్రుల బాగో గులు పట్టించుకోని వారసుల పట్ల తీవ్రం గా స్పందిస్తోంది. వారి పేరిట తల్లిదం డ్రులు చేసిన స్థిర చర ఆస్తులకు సంబం ధించిన పట్టాలను రద్దు చేసి తిరిగి ఆ వృద్ధ తల్లిదండ్రులకే చెందేలా సీనియర్ సిటిజన్ యాక్టు పనిచేస్తోంది. అలాగే ఉద్యోగాలు చేసే పిల్లల తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేత నం నుంచి రూ. 10వేలు ఇచ్చే వెసులు బాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి ఉంటాయి. అయితే వేధింపులు, కర్కశత్వం మరీ ఎక్కువగా ప్రదర్శించిన వారసులపై ఘటన తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉం టుందని అధికారులు చెబుతున్నారు. ఈ చట్టంపై గతంలో అంతగా అవగాహన లేకపోవడంతో అంతగా ఫిర్యాదులు అందలేదు. కానీ ఇటీవల కాలంలో అధికారులు సీని యర్ సిటిజన్ యాక్టుపై ప్రచారం కల్పిస్తుం డడంతో ఎంతోమంది వృద్ధులు తమకు భరోసా కావాలంటూ కార్యాలయాల మెట్లు తొక్కుతున్నారు. దాంతో 'వారసులూ తస్మాత్ జాగ్రత్త!' అంటూ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి కేసు..

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తా ఫాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజకొంరయ్య తనకున్న 4.12 ఎకరాలను తన కుమారుడు రవి పేరిట పట్టా చేయిం చాడు. కానీ ఆ తర్వాత రవి తన తండ్రి బాగోగులను చూడక పోవడంతో పాటు ఒకటి రెండుసార్లు రాజకొంరయ్యపై దాడి కూడా జరిగింది. దీంతో సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలు సుకున్న రాజకొంరయ్య భీమదేవరపల్లి తహసీల్దార్, హనుమ కొండ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

వారు విచారణ చేసి రవికి చేసిన పట్టాను రద్దు చేశారు. తిరిగి 3.20ఎకరాలను రాజకొంరయ్యకు పట్టా చేసి ఇవ్వడం ఇటీ వల సంచలనం రేపింది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో తొలిసారి సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేయడంతో అందరిలోనూ అప్రమత్తత పెరిగింది.

డివిజన్ పరిధిలో 12 ఫిర్యాదులు



రాథోడ్ రమేష్, ఆర్డీవో, హనుమకొండ

హనుమకొండ డివిజన్ పరిధిలో సీనియర్ సిటిజన్ యాక్టు కింద 12 ఫిర్యాదులు అందాయి. వీటిపై ఆయా పరిధిలోని తహసీల్దార్లు విచారణ జరుపు తున్నారు. వృద్ధ తల్లిదండ్రులు, వారి పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోకపోతే కుమారులపై చేసిన వ్యవసాయ భూముల పట్టాను తిరిగి వృద్ధ తల్లిదండ్రులకే చేసే వెసులుబాటు సీనియర్ సిటిజన్ యాక్టుకు ఉంది. అలాగే ఉద్యోగాలు చేసే వారు తమ వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూడకపోతే వారి వేతనం నుంచి రూ.10వేలు భరణంగా ఇవ్వాల్సి ఉంటుంది.

సీనియర్ సిటిజన్ యాక్టు పవర్ ఫుల్



ప్రవీణ్, తహసీల్దార్, భీమదేవరపల్లి

సీనియర్ సిటిజన్ యాక్టు పవర్ ఫుల్ గా మారింది. ఈ యాక్టుపై విస్తృతంగా ప్రచారం నిర్వహి స్తున్నాం. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రు లను పట్టించుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉంటుంది. అలా చేయకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తే ఈ యాక్టు ద్వారా వారసులు పట్టా తిరిగిచ్చేడం, వేతనం నుంచి భరణం ఇవ్వడం లాంటివి ఎదుర్కోవాల్సి ఉంటుంది. వృద్ధులపై మరీ కర్కశంగా వ్యవహరిస్తే జైలు శిక్షకూడా పడే అవకాశం ఉంటుంది.

మమ్మల్ని పట్టించుకోవడం లే..

- కుమారులపై కలెక్టర్‌కు దంపతుల ఫిర్యాదు
- జనగామ జిల్లాలో ఘటన

చిలుపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన భూమిని అమ్మగా వచ్చిన డబ్బు ను తమకు ఇవ్వకుండా, అనారోగ్యంతో బాధపడుతున్న తమను పట్టించుకోవడం లేదంటూ వృద్ధ దంప తులు తమ కుమారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. జనగా మ జిల్లా చిలుపూర్ మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన శెట్టబోయిన వెంకట కిష్టయ్య దంపతులకు నలుగురు కుమారులు. ఓ కుమారుడు వివాహానంతరం అత్తగారింటికి ఇల్లరికం పోగా.. మిగిలిన ముగ్గురు కుమారులకు తమకు ఎనిమిదెకరాల్లో తలా రెండున్నరెకరాలు పట్టా చేశారు.

మిగిలిన 30 గుంటల భూమిని వెంకటకిష్టయ్య తన పేరిట ఉంచుకున్నాడు. ఈ క్రమంలోనే అన్న దమ్ముల పాలుకు సంబంధించి మరో ఎకరన్నర భూమి వెంకటకిష్టయ్య వాటాకు రాగా.. దాన్ని విక్రయించగా వచ్చిన డబ్బులను కూడా కుమారులే తీసుకున్నారు. కానీ వెంకటకిష్టయ్య వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటం, వైద్యు లు ఓ కాలును తొలగించడంతో ఇబ్బందులు మొద లయ్యాయి. ఈ సమయంలో కుమారులు తమను పట్టించుకోకపోగా అవసరాలకు డబ్బులు ఇవ్వాలని కోరితే పట్టించుకోవడం లేదని కలెక్టర్ ఎదుట వాపోయినా ఆ తండ్రి చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న వెంకట కిష్టయ్య దంపతులు

అడ్డురాని వైకల్యం

- పారా తైక్వాండోలో ఓరుగల్లు యువకుడి సత్తా
- అంతర్జాతీయ టోర్నీకి ఎంపికైన గౌతమ్‌యాదవ్


గౌతమ్‌యాదవ్‌తో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు11: (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడు ఒకప్పుడు తైక్వాండో శిక్షకుడిగా ఎంతో మంది క్రీడాకారులకు శిక్షణ నిచ్చి.. అనేక వేదికపై స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించేలా వారిని తీర్చి దిద్దారు. కానీ విధి ఆడిన వింత నాటకంలో మృత్యు వుకు చేరువై కోలుకుని వీల్‌చైర్‌కే పరిమిత మయ్యాడు. అయినా మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేసి ఆటలకు వైకల్యం అడ్డుకా దని నిరూపించాడు. అంతర్జాతీయ స్థాయి సీని యర్ పారా తైక్వాండో పూమ్‌సే చాంపియ న్‌షిప్ 2024 పోటీలకు ఎంపికై స్ఫూర్తిగా నిలు స్తున్నాడు వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన గౌతమ్ యాదవ్.

స్వతహాగా తైక్వాండో శిక్షకుడైన గౌతమ్ ఎం తో మంది క్రీడాకారుకులకు శిక్షణనిచ్చారు. 2020లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రం గా గాయపడిన గౌతమ్ మృత్యువు ఒడి నుంచి బయటపడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. కొన్ని నెలల పాటు వీల్ చైర్‌కే అంకితమైన అయన మొక్కవోని దీక్ష, ఆత్మవిశ్వాసంతో తన కు నచ్చిన తైక్వాండో క్రీడపై ఉన్న అసక్తితో పారా తైక్వాండోను ఎంచుకున్నాడు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పలు పతకాలను సొంతం చేసుకొని ఆట లకు అంగవైకల్యం అడ్డుకాదని నిరుపించిన గౌ తమ్ ఈ నెల 9, 10 తేదీల్లో పంజాబ్ రాష్ట్రంలోని లవ్లీ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి ఓపెన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పూమ్‌సే 51విభాగంలో గౌతమ్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం కొల్లగొట్టారు.

అక్కడి నుంచి ఈ నెల 24నుంచి 28వరకు బహ్రెయిన్ దేశంలో జరిగే 1వ అంతర్జాతీయ స్థాయి సీనియర్ పారా తైక్వాండో పూమ్‌సే చాంపియన్‌షిప్ 2024 పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా గౌతమ్‌ను భారత తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు వీణాకు మారి, హర్యానా తైక్వాండో అసోసియేషన్ అధ్య క్షుడు వినోద్‌కుమార్, తెలంగాణ పారా తైక్వాం డో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎస్ దిలీప్, ప్రధాన కార్యదర్శి ఎల్లావుల గణేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రవి, ఉమ్మ డి వరంగల్ జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సీని యర్ క్రీడాకారులు అభినందించారు.

చంద్రాపూర్ ఎన్నికల పరిశీలకుడిగా రామకృష్ణ

హనుమకొండ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర చంద్రాపూర్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ నియమితుల య్యారు. ఈ మేరకు ఏఐసీసీ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఏఐసీసీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి చంద్రాపూర్ పార్టీ అభ్యర్థి ప్రవీణ్ నానాజీ బద్వేకర్ గెలుపు కో సం శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా రామకృష్ణ పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి పోస్టుమెట్రిక్ ఉప కార వేతనాల కోసం వరంగల్ జిల్లాలోని బీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెను కబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెష్, రెన్యూవల్ విద్యార్థు లు తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో డిసెంబరు 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యం విద్యార్థుల వివరాలను నమోదు చేయించాలని సూచించారు.

నేడు కోటి దీపోత్సవం

హాజరు కానున్న మంత్రి సురేఖ

న్యూశాయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : న్యూశాయంపేటలోని ధోనగుట్టపై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవా రం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవా లయ చైర్మన్ గ్రంధి సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మం త్రి కొండా సురేఖ హాజరవుతున్నట్లు గ్రంధి సత్యవతి ఆ ప్రకటనలో తెలిపారు.

ఐడీలు కేటాయించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 2024 డీఎస్సీ ద్వారా ఉద్యోగా లు సాధించిన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీ లు కేటాయించి సకాలంలో వేతనాలు అందే వి. దంగా చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ వరం గల్ జిల్లా ప్రధానకార్యదర్శి సి. సుజన్ ప్రసా ద్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం ఏటీ వో పరంజ్యోతికి ట్రెజరీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కాలయాపన చేయ కుండా కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారికి సకాలంలో వేతనాలు అందే విధంగా ట్రెజరీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, షకీల్ మోయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ వర్సిటీ సందర్శన


చైర్మన్ వెంకటయ్యను సన్మానిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మరో ఇద్దరూ సభ్యులు రాంబాబు నాయక్, రేణుకుంట్ల ప్రవీణ్‌లు సోమ వారం కాకతీయ యూని వర్సిటీని సందర్శించారు. వర్సిటీ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ కె.అనితారెడ్డి, చిర్రరాజులతో కలిసి ఘనంగా సన్మానించారు. వర్సిటీలో నెలకున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వర్సిటీ క్యాంపస్‌లోని దూరవిద్య కేంద్రాన్ని సందర్శించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నేతృత్వంలో కేయూ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, ఇతర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. కేయూ దూరవిద్య కేంద్రాన్ని మరింత బలోపేతం చేయాలని, అడ్మిషన్లు పెంచాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అడ్మిషన్లు పెంచేందుకు యూజీసీ చైర్మన్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు తమకు హాస్టల్‌లేదని, ల్యాబ్ తమ కళాశాలకు దూరంగా ఉందని తెలిపారు. క్యాంపస్‌లోని ల్యాబ్, వర్క్‌షాప్‌లకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. వర్సిటీ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరిరామచంద్రం, ప్రొఫెసర్ జి.హన్మంతు, వరలక్ష్మి, డాక్టర్ సుజాత, డాక్టర్ కొట్టేభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీల హక్కులను కాపాడాలి

- విశాఖపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది జహ ఆరా
- కేయూలో బాలగోపాల్ 14వ ఎండోమెంట్ లెక్చర్


బాలగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, హరగోపాల్, తదితరులు

కేయూ క్యాంపస్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పురుషాధిక్య సమాజంలో స్త్రీల హక్కులను చిత్తశుద్ధితో కాపాడాలని విశాఖపట్నంకు చెందిన ప్రముఖ న్యాయవాది జహ ఆరా పిలుపునిచ్చారు. సోమవారం కేయూ సెనెట్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మానవ హక్కుల నేత డాక్టర్ కె.బాలగోపాల్ 14వ ఎండోమెంట్ లెక్చర్ జరిగింది. ప్రముఖ హక్కుల నేత, ప్రొఫెసర్ జి. హరగోపాల్, యూజీసీ న్యూ ఢిల్లీ మాజీ న్యాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొన్న సదస్సులో జహ ఆరా ముఖ్య అతిథిగా హాజరై 'స్త్రీల హక్కులు.. న్యాయ వ్యవస్థ పాత్ర' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. చదువుతో విజ్ఞత పెరు గాలన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకూడదన్నారు. మహిళా సాధికారత పెరుగాలన్నారు. మానవ హక్కుల ను మహిళ హక్కు లని అభివర్ణించారు. మహిళ చట్టాలను చిత్తశుద్ధితో అమ లు చేయాలని స్పష్టం చేశారు. యూజీసీ న్యూఢిల్లీ పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. బాలగోపాల్ సమాజంపై కమిట్‌మెంట్ కలిగి న ఉద్యమకారుడని చెప్పారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల కోసం చిత్తశుద్ధితో అందరం పనిచేయా లన్నారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవితా న్ని ప్రజల కోసం త్యాగం చేసిన బాలగోపాల్ త్యాగాన్ని యువత అందిపు చ్చుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. బాలగో పాల్ గొప్ప మానవతావాది అని చెప్పారు. సదస్సు ప్రారంభంలో బాలగోపా ల్ సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు ప్రభాత్‌లతో కలిసి బాలగోపాల్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జహ ఆరాను శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానిం చారు. సదస్సులో వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సురేశ్ లాల్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియం త్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, ప్రొఫెసర్ బైరు వెంకట్రా మిరెడ్డి, ప్రొఫెసర్ కృష్ణయ్య, మాజీ వీసీ ప్రొఫెసర్ కె.సీతారామారావు, పాలక మండలి సభ్యులు చిర్రా రాజు, డాక్టర్ కారుకాల అనితారెడ్డి, పుల్లూరి సుధా కర్, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకంపై ఉత్కంఠ

- ముగ్గురి పేర్లతో సీఎం వద్దకు ఫైల్ ?
- పదేళ్లుగా ఒక్కరే ఉపకులపతి

వరంగల్ మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాళోజీ నారా యణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు పేర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు ఫైల్ చేరినట్లు విశ్వసనీయ సమాచారం. పది సంవత్సరాలుగా ఓసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి ఉపకులపతిగా కొనసాగు తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన వీసీ నియామకం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 1987 లో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో విజయవాడలో హెల్త్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 2014 రాష్ట్ర విభజన జరిగే వరకు అనేక మంది ఉపకుల పతు లుగా నియామకమయ్యారు. వీరిలో అత్యధికులు ఆంధ్ర ప్రాంతా నికి చెందిన వారు అందులోనూ ఉన్నత వర్గానికి చెందిన వారే ఎక్కువగా ఉండడం విశేషం. అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఉపకు లపతిగా ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించగా.. ఆయన పదేళ్లుగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యావేత్తలకు ఉపకులపతిగా అవకా శం కల్పించాలని డిమాండ్ వినిపిస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనుభవం, అర్హత ఉన్న ప్రొఫెసర్ల వివరాలు ఉన్నాయని సమాచారం. రాష్ట్రంలో 65 వైద్య కళాశాలలు, వీటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో పారా మెడికల్ కోర్సులు బోధించే కళాశాలలు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోనే ఉన్నాయి. ఇంత టి విశిష్టత కలిగిన ఈ విశ్వవిద్యాలయానికి బోధన అనుభవం, నైతిక ప్రవర్తన కలిగిన వ్యక్తితో పాటు సామాజిక న్యాయం జోడించి ఉపకులపతి ఎంపిక చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

సర్వేపై.. సందేహాలెన్నో!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ల ద్వారా వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందిన వివరాలను కూడా చెప్ప కుండా దాచేస్తున్నారు. దళిత బంధు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, ఇంకా ఇతర పథకాల ద్వారా పొందిన సాయం విషయాన్ని కూడా దా చేస్తున్నారు. ఆధార్‌కార్డు వివరాలు తెలియజే యడం ఐచ్ఛికం అని చెప్పడంతో వాటిని కొంద రు ఇస్తుండగా.. మరికొందరు ఇవ్వడం లేదు. ఇంటింటి సర్వేకు వెళ్లిన ఎన్యూమరేటర్లను ఎన్ని కల హామీల అమలుపై నిలదీస్తున్నారు. నిరుపే ద, మధ్య తరగతి ఇళ్లవారు సహకరించినంతగా సంపన్నులు, విలాసవంతమైన విల్లాల్లో నివాస ముంటున్నవారు వివరాలు ఇవ్వడానికి ముం దుకు రావడం లేదని తెలుస్తోంది. ఆర్థిక, సామా జిక, విద్య, కుల సర్వే నిరుపేదలకు సంబంధించిందని వారు భావిస్తున్నందు వల్లనే వివరాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. విలాసవంతమైన కొన్ని ఇళ్ల గేట్లు వేసి ఉండడం, ఆ ఇళ్లలో కుక్కలు ఉండడం, ఎన్నిసార్లు కాలింగ్ బెల్ కొట్టినా స్పందన లేకపో వడం కూడా వివరాల సేకరణలో కష్టమవుతు న్నదని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. కొందరై తే కులగణనకు వచ్చామని చెబితే మాకవసరం లేదని ముఖం మీదే తలుపు లేస్తున్న చేదు అనుభవాలను కూడా వారు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. సంప్రదాయ కులవృత్తిని ఎంచుకొని దాని ద్వారానే ఉపాధి పొందుతున్న వారి వివరా లు నమోదుకు అవ కాశం లేకుండాపోవడంతో ఆయా కుల సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లను ఈ విషయమై నిలదీస్తున్నారు. సర్వే ఫారంలో కుల వృత్తి కాలం ఎందుకు లేదని, దానిపై ఆధారపడి బతుకుతున్న వారి ఆర్థిక, ఉపాధిని ప్రభుత్వం ఎలా లెక్కిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

భద్రాద్రి జోన్ స్పోర్ట్స్ మీట్ అదరహో

- విద్యార్థులతో సందడిగా మారిన గురుకులం
- పోటీలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్
- తొలి రోజు హుషారుగా పోటీలు


జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మరిపెడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరిపెడ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో సోమవారం భద్రాద్రి 10వ జోన్ స్పోర్ట్స్ మీట్ పోటీలు అదరహో అనిపించాయి. విద్యార్థుల సంబరాలు అంబ రాన్ని అంటాయి. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే జాటోత్ రాంచం ద్రునాయక్ ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడాజ్యోతిని వెలి గించి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భద్రాద్రి ఫోర్త్ జోన్ పరిధిలోని కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 11 గురుకుల పాఠశాలలకు చెందిన 935 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని తొలి రోజు తమ ప్రతిభను చాటారు. పోటీల ప్రారంభం సందర్భంగా తొర్రూరు, మరిపెడ బాలికల గురుకుల విద్యార్థులు తమ నృత్యా లతో హోరెత్తించారు. వర్ధన్నపేట గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగా ఆసనాలతో అదరగొట్టారు. తొలి రోజు స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు హుషారుగా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

స్పోర్ట్స్ మీట్ సందర్భంగా వివిధ గురుకుల పాఠశాలల విద్యా ర్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ సభికులను, విద్యార్థులను ఆకట్టు కుంది. మరిపెడ, తొర్రూరు గర్ల్స్ గురుకుల విద్యార్థులు త్రివర్ణ రంగుల దుస్తులు ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వివిధ గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆయా స్కూల్స్ క్రీడా దుస్తులు ధరించి అతిథులకు వందన సమర్పణ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డితోనే బంగారు భవిష్యత్

సీఎం రేవంత్‌రెడ్డితోనే నిరుపేద విద్యార్థులకు బంగారు భవిష్య త్ ఉందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. సోమవారం రాంచంద్రునాయక్ భద్రాద్రి జోన్ 10వ స్పోర్ట్స్ మీట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హాస్టల్, గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వడా నికి మెస్ చార్జీలను 40 శాతం పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాకారులకు గ్రూప్-1 స్థాయి ఉద్యోగం కల్పిం చిన విషయాన్ని ఉదహరించారు. జిల్లాకో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. తాను సైతం సోషల్ వెల్ఫేర్, ఆర్‌జేసీ పూర్వ విద్యార్థినే అని అన్నారు.

ఆటల్లో ఉండడంతో పుస్తకాలను నమ్మి డాక్టరయ్యానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటి కొమ్ము యుగేందర్‌రెడ్డి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీఎస్‌వోలు, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, ప్రిన్సిపాల్ దయాకర్, మాజీ ఎంపీటీసీ గందసిరి అంబ రీశ, మాజీ సర్పంచ్ రాంలాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజ్ ద్దీన్, మీడియా ఇన్‌చార్జ్ నరేందర్, పీడీ వంగ రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

11 రకాల ఆటల పోటీలు

ఈ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా 11 రకాల ఆటల పోటీలకు మరి పెడ సోషల్ వెల్ఫేర్ స్కూల్ వేదికగా నిలిచింది. అండర్-14, 17, 19 విభాగాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క పాఠ శాల నుంచి 85మంది విద్యార్థుల చొప్పున 11 గురుకుల పాఠశాలల నుంచి మొత్తం 935 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. వారికి సహాయకులుగా ఆయా గురుకుల పాఠశాలల పీడీలు, పీఈటీలు, గైడ్, ఎస్కార్ట్ టీచర్లు పాల్గొన్నారు. తొలి రోజు 600 మీటర్స్ రన్నింగ్, 5కే రన్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. 600 మీటర్ల అండర్-14 విభాగంలో నితిన్(మణుగూరు), సీహెచ్.రిషి(మరిపెడ), జి.గణే శ్(దమ్మపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకు న్నారు. 5కే రన్ అండర్-17లో జె.గౌతమ్(దమ్మపేట), కె.రవితేజ(దమ్మపేట), కె.మణికాంత్(సత్తుపల్లి), అండర్-19 విభాగంలో బి.దిలీప్(పాల్వంచ), జీఎల్‌కే మదన్‌సా యి(పాల్వంచ), కె.ప్రతాప్(నర్సంపేట), లాంగ్‌జంప్ అండర్-14, 17, 19 విభా గంలో ఎస్.శ్రీకాంత్(పాల్వంచ), కె.గౌత మ్(పాల్వంచ), ఎం.నితిన్(మణుగూరు), కె.ఆనంద్(ఏఆర్‌పల్లి), జి.అభినయ్(పాల్వంచ), బి.మోహన్(టి.పాలెం), ఎం.శ్రీరామ్(ద మ్మపేట), ఎం.కాంతి(టి.పాలెం), జి.శశిధర్(మరిపెడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.


యోగా ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

టై, బెల్టుల పంపిణీ

ఇనుగుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం 200 మంది విద్యార్థులకు 1981-82 టెన్త్ బ్యాచ్ ఆధ్వర్యంలో రూ.10వేల విలువైన టై, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో రూపారాణి, పీడీ రాజేందర్, ప్రణయ్, యాకయ్య, పూర్వ విద్యార్థులు వద్దిరాజు మోహన్, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, గంజి తిరుపతిరెడ్డి, రామగిరి వెంకటేశ్వర్లు, సంగ శ్రీరంగం, బత్తిని రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సర్వే ఒత్తిడి తగ్గించాలి

కేసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి ఒత్తిడి తగ్గించాలని కోరుతూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కేసముద్రం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి వెంకట్రానర్సయ్య ఒక్కో ఉపాధ్యాయునికి తొలుత 150 ఇళ్లు ఇస్తామని చెప్పి క్షేత్ర స్థాయిలో 200 ఇళ్లు ఇచ్చారని తెలిపారు. సర్వే చేసేందుకు సమయం అధికంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, నర్సింహరాజు, ఊట్కూరి ప్రణయ్, వీసం నర్సయ్య పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి చేసుకోవాలి

జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి చేసి ఆయిల్‌పాం సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న అన్నారు. మహబూబాబాద్ మండలంలోని అమనగల్, గుండాలగడ్డ తండా, పర్వతగిరి, ముడుపుగల్ గ్రామాల్లోని ఆయిల్‌పాం తోటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ... ఆయిల్‌పాం గెలలు టన్నుకు రూ.19వేలకు పైగానే ధరలు పలుకుతున్నాయని చెప్పారు. ఆయిల్‌పాం తోటలకు రూ.50,918 రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తేళ్ల లింగయ్య, బిందు సేద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే

తొర్రూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కర్కాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పేదలకు, రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రైతులు తెచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, రైతులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి



తీగలవేణి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఆఫీసర్ డాక్టర్ సారంగం

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం అన్నారు. తీగలవేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గర్భిణుల నమోదు 12 వారాల్లోగా పూర్తి చేయాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్న గర్భిణులను గుర్తించి తగు సూచనలు చేస్తూ జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయలను తీసుకోవాలని, ఆహార సమతుల్యత పాటించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు, కేవీ రాజు, డాక్టర్ కిరణ్, సిబ్బంది షైనూబేగం, మనోహర్, శోభ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : ఏవో

తొర్రూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎరువుల వ్యాపారులు పురుగు మందులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం తొర్రూరులోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై వ్యాపారులకు సూచనలు చేశారు. కాంప్లెక్స్ ఎరువుల విక్రయాల్లో పూత మందులు రైతులకు అంటగడుతున్నారని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా పీడీ యాక్టులు నమోదు చేస్తామన్నారు. రైతులు తాము కొన్న ఎరువులకు బిల్లులు తీసుకోవాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

నెహ్రూసెంటర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం పథకంలో భాగంగా ఆరు క్యాడర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసినట్లు జిల్లా వైద్యాధికారి గుండాల మురళీధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మురళీధర్ మాట్లాడుతూ... ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా మెరిట్ ప్రకారం అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందులో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) కింద ఏడు వైద్యాధికారుల పోస్టులకు గాను ఆరుగురు అభ్యర్థులు హాజరయ్యారని, ఫిజియోథెరపిస్టు, ఫార్మసిస్టు, రేడియోగ్రాఫర్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్, సపోర్టింగ్ స్టాఫ్ కౌన్సిలింగ్‌కు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి, జిల్లా సమన్వయ కోఆర్డినేటర్ వెంకట్రాములు, వలీమహ్మద్, రాధిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు చోటులేదు

డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



నల్లెల్లలో బీఆర్ఎస్ నేత కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న రెడ్యానాయక్

కురవి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థలో దాడులకు చోటు లేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ అన్నారు. కురవి మండలం నల్లెల్లలో ఎన్.కృష్ణమూర్తిని సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకుడు మల్లయ్య బీఆర్ఎస్ నాయకుడు కృష్ణమూర్తిపై దాడి చేయడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పోటీచేసే హక్కు ఉందని, అధికార జులుం చెలాయిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, సంజీవ, నామ సైదులు, బండి దీపక్, బండి శ్రీను పాల్గొన్నారు.

వ్యాపారి కుటుంబానికి పరామర్శ

డోర్నకల్ : డోర్నకల్ పట్టణానికి చెందిన వ్యాపారి రాధేశ్యామ్ లడ్డా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సోమవారం డోర్నకల్‌కు చేరుకుని వ్యాపారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రాధేశ్యామ్ లడ్డాతో తనకున్న పరిచయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, సురేశ్‌కుమార్ పాట్నీ(మన్ను), బీఆర్ఎస్ నాయకులు కల్లెపు సతీ‌ష్‌గౌడ్, సమ్మిరెడ్డి, అజిత్‌మియా, పాండునాయక్, కొత్త వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జిల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్‌లోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం, రాష్ట్ర మైనారిటీ దినోత్సవం, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచి నాణ్యమైన విద్యతో పాటు భోజన సదుపాయాలను కల్పిస్తుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు సాంస్కృతిక, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్‌రావు, మైనారిటీ పెద్దలు మహ్మద్ ఇక్బాల్, షేక్ అక్రమ్, మహ్మద్ అలీమ్, మహ్మద్ జాకీర్, మహ్మద్ అలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో గత విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు భానుప్రసాద్, మున్వర్ పాషాతో పాటు హాకీ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి ఉమేష్‌ను సన్మానించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ మదార్, ప్రిన్సిపాల్ మహ్మద్ రహీం హుస్సేన్, ఎక్బాల్, అనసారి, అక్రమ్ పాల్గొన్నారు. అలాగే నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా దినోత్సవంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు మసూద్ అహ్మద్, సాంబశివరావు, అనిల్‌కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, సుమన్, సుమలత, ఉపేందర్, ప్రభావతి పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపును అడ్డుకున్న కార్మికులు

మరిపెడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్మిక వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులు కాజేయడానికే ప్రభుత్వం, ప్రైవేట్ ఏజెన్సీలు హెల్త్ క్యాంపులను ప్రోత్సహిస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య అన్నారు. సోమవారం మండలంలోని అబ్బాయిపాలెంలో సీఎస్‌ఈ హెల్త్ కేర్‌కు చెందిన వైద్యులు లేబర్ కార్డు కలిగి ఉన్న వారికి ఆరోగ్య పరీక్షలు పేరుతో ఐడీ కార్డు నెంబరు రికార్డు చేసుకోవడం ఏమిటని వైద్యులను ప్రశ్నించారు. మందులు ఇవ్వకుండా హెల్త్ క్యాంపులు ఎందుకు ఉపయోగపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు హెల్త్ క్యాంపులు నిర్వహించవద్దని వెంటనే వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే హెల్త్ కార్డులను మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జామూర్తి, వెంకన్న, రాములు, పరుశురాములు, బాలకృష్ణ, ఏకస్వామి, చంద్రయ్య, మంగమ్మ, పార్వతి, ఎల్లమ్మ, మైసయ్య, ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తొర్రూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మీరజ్ పుట్టిన రోజు సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండగలుగుతారని, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు జ్వలిత, మానస, ప్రియాంక, వనాకర్ రెడ్డి, పెద్దవంగర లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, రేణుక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్ : ఎంఈవో



విద్యార్థులకు బెల్ట్‌లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

చిన్నగూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో రవి కుమార్ అన్నారు. సోమవారం జయ్యారం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పృథ్వీరాజ్ తన మిత్రుల కుమారులు అల్లు సత్యప్రశాంత్, వడ్లమని వెంకటేష్‌ల సహకారంతో స్థానిక ప్రాథమిక పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు బెల్ట్‌లను సమకూర్చారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో సహకరించిన ఉపాధ్యాయుడు పృథ్వీరాజ్, దాతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, సంపత్, మల్లికార్జున్, మురళి, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను గుర్తించకపోవడం సరికాదు

తొర్రూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో విశ్వబ్రాహ్మణులను గుర్తించకపోవడం సరికాదని సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు సర్వేలో విశ్వబ్రాహ్మణులను గుర్తించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో గణేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ కుల గణనలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని అవమానపర్చేలా కులం పేరు ప్రస్తావన లేకుండా కేవలం వృత్తులకు సంబంధించిన కోడ్‌లు కేటాయించి వర్గీకరణ చేపట్టడం శోచనీయమన్నారు. కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణుల పదం తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఆపదాన్ని వెంటనే చేర్చి కోడ్ నంబర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కల్లూరి నాగేంద్రచారి, విజయ్ కుమార్, డి.శ్రీను, పూర్ణాచారి, కృష్ణప్రసాద్, విష్ణు, రమాకాంత్, వినయ్ కుమార్, విక్రమ్, శ్రీధర్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి వ్యక్తి మృతి



శ్రీను (ఫైల్)

కొత్తగూడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రౌతుగూడెంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. రౌతుగూడెం గ్రామానికి చెందిన బోడ శ్రీను(46) చేపలు పట్టేందుకు సమీప చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతుండగా వల కాళ్లకు చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. మృతునికి భార్య శారద, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు

పది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపారు. కురవి మండలంలోని లక్ష్మీతండా నుంచి డోర్నకల్ మండల పరిధిలోని లింబ్యాతండా గ్రామ పంచాయతీ పరిధి లచ్యతండాకు ఆటోలో బెల్లం తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు లచ్యతండా వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. బెల్లం తరలిస్తున్న అజ్మీర దేవ్‌సింగ్, వాంకుడోతు రాము, భూక్య నరేష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వెంకటేష్, వీరన్న పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు. పట్టుబడిన వారిని విచారించగా మహబూబాబాద్‌కు చెందిన నరేష్ అనే వ్యక్తి ద్వారా బెల్లం కొనుగోలు చేసినట్లు చెప్పారని ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు మహిళల బైండోవర్

మండలంలోని బొడ్రాయితండాకు చెందిన ముగ్గురు మహిళలు గుడుంబా తయారు చేస్తూ పట్టుబడినట్లు ఎస్సై వంశీధర్ వారిని స్థానిక తహసీల్దార్ కృష్ణవేణి ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



సత్యనారాయణపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండలంలోని సత్యనారాయణపురంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. గార్లలో కట్టమైసమ్మ దేవాలయం చుట్టూ ప్రహరీ పనులకు శంకుస్థాపనతో పాటు ముల్కనూరు, కొత్త పోచారం, పాత పోచారం, శేరిపురం గ్రామాల్లో రూ.20 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 21 మంది లబ్ధిదారులకు రూ7.20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ధరతోపాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతిపక్షాలు రైతులను గందరగోళం చేస్తూ తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని అన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై ఆగ్రహం

గార్ల వర్తక సంఘం భవనంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కార్యకర్తల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడైనా న్యాయం జరుగుతుందని, దీన్ని సాకుగా తీసుకొని గ్రూపు రాజకీయాలు చేస్తూ పార్టీకి నష్టం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రవీందర్, విద్యుత్ ఏఈ మహేంద్రబాబు, డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి నాయకులు దనియాకుల రామారావు, మన్నేపల్లి సైదయ్య, మన్నేపల్లి వెంకయ్య, గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, రవినాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జిగట వెంకన్న, అశోక్ నాయక్, మండా రాముగౌడ్, జాటోత్ రమేష్, యాకుబ్ పాషా, బాబులాల్ నాయక్ పాల్గొన్నారు.

గణిత ఫోరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గణిత ఫోరం మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అడికె సతీష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా తాడూరి మాధవాచారి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక శ్రీధర్‌రెడ్డి, కోశాధికారిగా రామసహాయం శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మిరియాల సతీష్‌రెడ్డి, కాసం శ్రీనివాసరావు, ఎన్.సురేష్, ఉపాధ్యక్షులుగా మద్ది లింగమూర్తి, చీకటి ఉపేందర్, సునిత, టాలెంట్ టెస్ట్ కన్వీనర్‌గా జూలూరు పురుషోత్తం, దత్త ప్రసాద్, ఇందిరా అకాడమీ కో-ఆర్డినేటర్లుగా ఎం.సదయ్య, దుర్గాప్రసాద్, శ్రీవాణిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు డైరెక్టర్ నర్సిరెడ్డిని కలిసిన నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం మానుకోట టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల టీటీడీ బోర్డు డైరెక్టర్‌గా తెలంగాణకు చెందిన నర్సిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నర్సిరెడ్డిని స్థానిక టీడీపీ నేతలు కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కొండపల్లి రాంచందర్‌రావు, నాయకులు సుతారపు వెంకట నారాయణ, ప్రేమ్‌చంద్ వ్యాస్, ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కులగణనలో తప్పుడు సమాచారం ఇవ్వొద్దు

దంతాలపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమంలో ప్రజలు తప్పుడు సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు ఇవ్వొద్దని ఎంపీడీవో వివేక్‌రాం అన్నారు. సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పుతండా, ఆగపేట, రామవరం, గున్నేపల్లి, దంతాలపల్లిలో నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. ఫార్మెట్‌లో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు, ఏశబోయిన వెంకన్న, సిరబోయిన శ్రీనువాస్, నాగార్జున, అజయ్, మధు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అధోగతిపాలు చేస్తున్న కేంద్రం : సీపీఎం

నెల్లికుదురు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని బీజేపీ ప్రభుత్వం అధోగతిపాలు చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో సోమవారం సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెడుతుందన్నారు. మతోన్మాదంతో దేశంలో మతకల్లోలాలను పోత్సహిస్తున్నారన్నారు. నిత్యావసర ధరలను పెంచి పేద ప్రజలపై భారం మోపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో సర్పంచ్‌లు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నైనాల గ్రామానికి చెందిన ముగ్గురు బీఆర్ఎస్ కార్యకర్తలు దండెంపెల్లి కొమురయ్య, మయ్య అయిలయ్య, చెడుపాక వెంకన్న సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, మండల కార్యదర్శి పెరమాండ్ల తిలక్‌బాబు, బాబుగౌడ్, ఈసంపెల్లి సైదులు, తోట నర్సయ్య, గుగులోత్ వీరన్న, బొల్లం ఎల్లయ్య, పెరమాండ్ల పుల్లయ్య, మంగ్యానాయక్, సత్యనారాయణ, యాకయ్య, యాకాంతం, సైదులు, వెంకన్న, హరిత పాల్గొన్నారు.

‘తప్పుడు కథనాలు రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి’



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కథనాలు రాసి అధికారులు, సిబ్బందిని ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ మాట్లాడుతూ.... తప్పుడు కథనాలు రాయడం వల్ల ప్రజలకు తప్పుడు సమాచారం వెళ్తుందన్నారు. ఏదైనా శాఖా పరమైన వార్త రాసేముందు సంబంధిత శాఖ ఉన్నతాధికారి వివరణ తీసుకుని రాయాల్సి ఉంటుందని చెప్పారు. గత కొంత కాలంగా కొందరు జర్నలిస్టులమని చెప్పుకుంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తప్పుడు వార్తా కథనాలు రాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, అధికారులు కొప్పుల ప్రసాద్, సునిల్‌రెడ్డి, పవన్‌కుమార్, నారాయణమూర్తి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, డాక్టర్ నరేష్, వెంకన్న,ఫిరోజ్, సునిల్ పాల్గొన్నారు.

ఎస్పీకి జర్నలిస్టుల విజ్ఞప్తి..

జిల్లాలో కొందరు సంస్థ ఐడీకార్డు, అక్రిడేషన్ కార్డు కూడా లేకుండా వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు అంటించుకుని ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని పలువురు జర్నలిస్టులు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోషల్ మీడియా వేదికగా అనేక గ్రూపులు ఏర్పాటు చేసి అధికారులపై తప్పుడు సమాచారం ఇస్తూ స్వప్రయోజనాల కోసం అందరిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టు విలువలను దిగజార్చుతూ పబ్బం గడుపుతున్న నకిలీలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

కేసముద్రం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించే సన్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు మార్కెట్ ఆవరణలోని గోదాంను పరిశీలించారు. మార్కెట్‌లో 10వేల మెట్రిక్ టన్నుల గోదాం ఉందని జిల్లా అధికారుల నివేదికతో కలెక్టర్ పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిసింది. అయితే 10వేలకు బదులు వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాం ఉండడంతో తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులను కలెక్టర్ మందలించి వెంటనే వెళ్లిపోయారు. కలెక్టర్ వెంట జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై డీఎం కృష్ణవేణి, జిల్లా సప్లై అధికారి ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో కృష్ణవేణి, మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు, కమిటీ సభ్యుడు చిదురాల వసంతరావు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నెల్లికుదురు : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సోమవారం పరిశీలించారు. మార్కెట్ యార్డులోని గోదాంను పరిశీలించి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, సివిల్‌సప్లై డీఎం కృష్ణవేణి, తహసీల్దార్ కె.రాజు పాల్గొన్నారు.

మానుకోట లయన్స్ సేవలు భేష్

లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో వరద బాధితులకు అండగా నిలిచిన మానుకోట లయన్స్ క్లబ్ సేవలు భేష్ అని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్-320ఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు అన్నారు. వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్-320ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి గాను ఉత్తమ సేవలందించిన లయన్స్‌క్లబ్ మానుకోట శాఖకు అవార్డు లభించింది. ఇందులో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్-320ఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు చేతుల మీదుగా మానుకోట శాఖ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్ రెడ్డి అవార్డును అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గట్టమనేని బాబురావు మాట్లాడుతూ... మున్ముందు కూడా సేవలను ఇలానే కొనసాగిస్తూ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ రామసహాయం వెంకట్‌రెడ్డి, జోన్ చైర్మన్ రావుల రవిచందర్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, పీవీ.ప్రసాద్, అనుమాల వెంకటేశ్వర్లు, చాడ అశోక్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, కొండపల్లి కేశవరావు, పర్కాల రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, కొండపల్లి కరుణాకర్ రెడ్డి, రావుల ప్రదీప్‌రెడ్డి, నాయిని రంజిత్ పాల్గొన్నారు.



వరంగల్‌లో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డెరెక్టర్ బాబురావు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న మురళీధర్‌రెడ్డి

కేసముద్రం లయన్స్‌క్లబ్‌కు ‘సేవా అవార్డు’

కేసముద్రం : కేసముద్రం లయన్స్‌క్లబ్‌కు గ్లోబల్ యాక్షన్ టీం(గ్యాట్) కార్యక్రమంలో సేవా అవార్డు దక్కింది. ఈ మేరకు వరంగల్ బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం రాత్రి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందురు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు కేసముద్రం క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్‌కు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ జడ్‌సీ ఊకంటి యాకూబ్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు వోలం ప్రభుకిరణ్, సుధాకర్, కె.రమేష్, రాముగౌడ్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.